వైఎస్ఆర్ కడప



తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

శనివారం 16 మే 2026


## ప్రజల సమస్యల పరిష్కారం కోసమే ప్రజా దర్బార్

**పెండ్లిమర్రి, మే 15, ప్రభాతవార్త:**



మండలంలోని గొందిపల్లె పంచాయతీ బాలయ్యగారిపల్లి గ్రామంలో శుక్రవారం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కమలాపురం ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాదర్బార్ ప్రజల సమస్యల పరిష్కారానికే ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రజలకు ఏమైనా సమస్యలుంటే అర్జీల రూపంలో తమ దృష్టికి తెస్తే పరిష్కరించడం జరుగుతుందన్నారు. సీఎం నారా చంద్రబాబునాయుడు గ్రామాలను అభివృద్ధి బాటలో నడిచేందుకు కృషి చేస్తున్నారన్నారు. పొలాలకు వెళ్లేందుకు గ్రావెల్‌రోడ్లు సైతం నిర్మించి సమస్యలు పరిష్కరిస్తున్నామన్నారు. సంక్షేమ పథకాలు అన్నీ ప్రజలకు అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శోభన్‌బాబు, ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి, ఎస్సై తులసీ నాగప్రసాద్, మండల కమిటీ అధ్యక్షుడు గంగిరెడ్డి, టీడీపీ నాయకులు కిశోర్, అన్నమయ్య శ్రీనాథ్‌రెడ్డి, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, డిప్యూటీ ఎంపీడీవోలు సుదర్శన్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, ఎంఈవో సుజాత, మండల స్థాయి అధికారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రతిభకు ప్రోత్సాహం..

## 162 మంది విద్యార్థులకు ఘన సన్మానం

### నేడు పులివెందులలో ఎమ్మెల్సీ ఆధ్వర్యంలో కార్యక్రమం

**పులివెందుల, మే 15 , ప్రభాతవార్త :**

పులివెందుల నియోజక వర్గంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ పదో తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరి చిన విద్యార్థులను ప్రోత్స హిం చేందుకు ప్రత్యేక సన్మాన కార్యక్రమాన్ని నిర్వహిం చనున్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు మరింత ప్రోత్సా హం అందించే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.నేడు అనగా మే 16, శనివారం ఉదయం 9 గంటల 30 నిమిషాలకు ఈ కార్యక్రమం ఘనంగా జరగనుంది. గౌరవ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో శ్రీమతి భూమిరెడ్డి ఉమాదేవి పాల్గొని ప్రతిభ కనబరిచిన 162 మంది విద్యార్థినీ, విద్యార్థులకు బహుమతులు అందజేయ నున్నారు.ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ప్రోత్స హిస్తూ వారి ఉన్నత చదువులకు ప్రేరణ కల్పించే ఈ కార్యక్రమం పులివెందుల నియోజక వర్గంలో విద్యారంగానికి మరింత ఊతమిస్తుందని పలువురు అభిప్రాయప డుతున్నారు. విద్యార్థులు మరింత కృషి చేసి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఈ సందర్భంగా నాయకులు ఆకాంక్షించారు.

### నిధులకు కొరత లేదు..

# మంచి ఆలోచనతో అడుగేయాలి





**మైదుకూరు, మే 15, ప్రభాతవార్త:**

మంచి ఆలోచన, చక్కటి ప్రణాళికతో అడుగు ముందుకేయాలే గానీ.. జిల్లాలో అభివృద్ధి పనులకు ఏ మాత్రం నిధుల కొరత లేదని... జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు.శుక్రవారం "జలధార జల హారతి సాగునీటి సంరక్షణ" లో భాగంగా స్థానిక ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ తోకలిసి మైదుకూరు మండలం శెట్టివారిపల్లె చెరువుకు నీరందించే పనులకు జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ప్రారంభించారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన గ్రామసభలో వారు ప్రసంగించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జలమే సంపద దాన్ని ఎంత పొదుపుగా వినియోగించుకుంటే అంత సంపదను సృష్టించవచ్చున్నారు. నీరు మనందరికీ సర్వస్వమని, నీటిని సంరక్షించుకోడానికే వంద రోజుల యాక్షన్ ప్లాన్ చేపట్టామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం "నీటి భద్రతసాగు నీటి సంఘాల బాధ్యత" లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. చెరువుల పునరుద్ధరణ, నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు లక్ష్యంగా ఈ కార్యక్రమం చేయపట్టడం జరుగుతోందన్నారు. జిల్లా స్థాయిలో అన్ని శాఖలు సమన్వయంతో కార్యక్రమాన్ని నిర్వహించాలని నీటి వినియోగదారుల సంఘాలు, గ్రామ పంచాయతీలు, ప్రజాప్రతినిధులు భాగస్వామ్యం ఉండాలన్నారు. ఇప్పటికే అన్ని మండలాల్లో చక్కటి ప్రణాళికలతో జలాధార కార్యక్రమం ద్వారా భూగర్భజలాలను సంరక్షించి.. సాగునీటి కొరతను తీర్చే పనులు జరుగుతున్నాయన్నారు. జలాధార కార్యక్రమంలో భాగంగా ముదిరెడ్డిపల్లె అభివృద్ధికి రణాళికలు సిద్ధం చేయడంతో అటు శెట్టివారిపల్లె చెరువుకు ఎస్.ఆర్. 1, 2 కాలువల అనుసంధానం చేసే ప్రక్రియను ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ చెరువుకు నీరందితే ఆయకట్టు ప్రాంత రైతులకు ఎలాంటి సాగునీటి కష్టాలు వుండవన్నారు. రైతు ఆలోచనా విధానంలో మార్పు రావాలని సూచించారు. రైతు ఆలోచనలో మార్పు వస్తేనే లాభాల బాటలో నడవగలడన్నారు. రైతులకు వెన్నుదన్నుగా ఉంటూ ఆదాయంలో స్థిరత్వాన్ని అందించేవి ఉద్యాన పంటలే అన్నారు. అధిక తక్కువ నీటి ఖర్చుతో అధిక దీర్ఘకాలిక ఆదాయాన్నిచ్చే ఉద్యాన పంటల సాగుపై మొగ్గుచూపాలన్నారు.విద్యా విషయానికి వస్తే.. ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా చక్కటి ఫలితాలను అందిస్తున్నాయన్నారు రాష్ట్ర ముఖ్యమంత్రి రాష్ట్ర విద్యా శాఖ మంత్రి వారి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ విద్యాలయాలు అత్యున్నతమైన విద్యనందిస్తూ విద్యార్థులు బంగారు భవిష్యత్తులకు బాటలు వేస్తున్నాయన్నారు. కార్పొరేట్ పాఠశాలల్లో అధిక డబ్బులు వెచ్చించి నష్టపోకుండా స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో విద్యను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. ఇటీవల పదవ తరగతి పరీక్షల్లో గ్రామానికి చెందిన ఉదయశ్రీ జిల్లాలో ద్వితీయ స్థానం సంపాదించి జిల్లాకే గర్వకారణంగా నిలవడం అభినందనీయమన్నారు. ఇలాంటి విద్యా రత్నాలు ప్రభుత్వ పాఠశాలలో ఉండడం గర్వించదగ్గ విషయమన్నారు. మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ వారి సూచనలు జిల్లాకు చక్కటిసీజన్లకు అనుగుణంగా, కాలానికి అనుగుణంగా పంటలను మార్పు చేసుకోవాలన్నారు. చెరువులు గ్రామాల సహజ సంపద అని చెరువులలో నీరు గ్రామంలో ప్రతి ఒక్కరి స్థిరఆస్తి అన్నారు. ప్రతి గ్రామంలోను రైతులు, వారి జలఆధారం, వారి పంటల సాగు, నీటి వినియోగంపై దృష్టి సారించాలన్నారు.

2వ పేజీలో

## ప్రజల కోసమే ఇంటింటికి తెలుగుదేశం

### అసెంబ్లీ ఇన్చార్జ్ జగన్మోహన్ రాజు



అగ్రహారంలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న జగన్మోహన్ రాజు

**రాజంపేట, మే 15 ప్రభాతవార్త**

ప్రజల సమస్యలు తెలుసుకునేందుకే రాజంపేట మున్సిపాలిటీ పరిధిలో ప్రతి ఇంటికి వస్తున్నామని, ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడం, ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా తెలుసుకోవడం ప్రధాన ఉద్దేశం అన్నారు. శుక్రవారం ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా ఆయన పార్టీ నాయకులతో కలిసి తుమ్మల అగ్రహారంలో పర్యటించారు. ప్రజలు అడిగి సమస్యలు తెలుసుకున్నారు.ప్రజలకు మౌలిక సదుపాయాలతోపాటు, ప్రశాంత వాతావరణంలో జీవనం సాగించేలా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా డ్రైనేజ్ ,రోడ్ల విస్తరణ,త్రాగునీరు,పెన్షన్స్ తదితర సమస్యలను ప్రజలు చమర్తి దృష్టికి తీసుకురాగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సి సుధాకర్,మాజీ రాష్ట్ర డైరెక్టర్ గుల్జార్ భాష,మాజీ రాష్ట్ర కార్యదర్శి ఇడిమడకల కుమార్, పట్టణ అధ్యక్షులు దగ్గుపాటి సుబ్రహ్మణ్యం నాయుడు, కౌన్సిలర్లు రాజేష్,మనుబోలు వెంకటసుబ్బయ్య,మాజీ పట్టణ అధ్యక్షులు సంజీవరావు, ప్రముఖ డాక్టర్ నవీన్ కుమార్, రాష్ట్ర ఎస్సీ సెల్ నాయకులు మందా శ్రీనివాసులు, పార్లమెంట్ కార్యాలయ కార్యదర్శి ఎస్కే కర్రీమ్,ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షులు జడ శివకుమార్, యువ నాయకులు సయ్యద్ ఇస్మాయిల్, యూనిట్ ఇన్చార్జ్ మహమ్మద్ అలీ, షేక్ పీరు సాహెబ్, చల్లా సుధాకర్ బాబు, జనసేన అబ్బిగారి గోపాల్, పెంచలయ్య, సుబ్రహ్మణ్యం యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

### గ్రామీణ ప్రాంతాలకు

## త్రీఫేస్ విద్యుత్ సరఫరా చర్యలు వేగవంతం

### ఎస్ఈ సోమ శ్రీనివాసులు ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈ సోమ శ్రీనివాసులు



సబ్ స్టేషన్‌లో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎస్ఈ

**రాజంపేట, మే 15 ప్రభాతవార్త**

ఆర్‌డిఎస్ఎస్ పథకం కింద గ్రామీణ ప్రాంతాలకు త్రీ ఫేస్ విద్యుత్ సరఫరా చేసేందుకు పనులు వేగవంతం చేయాలని కడప జిల్లా ట్రాన్స్‌కో ఎస్ఈ సోమ శ్రీనివాసులు ఆదేశించారు. అలాగే వ్యవసాయానికి మూడు ఫేసుల విద్యుత్ కోసం ప్రత్యేకంగా చేపడుతున్న సోలార్ విద్యుత్ పనులను కూడా వేగవంతం చేయాలని ఆదేశించారు. రాజంపేట విద్యుత్ డివిజన్ కార్యాలయంలో శుక్రవారం విద్యుత్ సేవల పురోగతి, వేసవి కాలానికి సంబంధించిన ఏర్పాట్లు, ప్రజలకు అందించే సేవల నాణ్యతపై సూపరింటెండింగ్ ఇంజనీర్ సోమ శ్రీనివాసులు సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో అధికారులు వివిధ అంశాలపై సమీక్షించారు. ప్రజల విద్యుత్ సమస్యలపై అధికారులు నిరంతరం అందుబాటులో ఉండి, వారు ఎదుర్కొనే విద్యుత్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.వేసవి కాలంలో క్షణం విద్యుత్ నిలిచినా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతారని,నిరంతర, నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం ముందస్తు చర్యలు తప్పనిసరిగా తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల ఫిర్యాదులను అధిక ప్రాధాన్యతతో పరిష్కరించాలన్నారు. ఫిర్యాదు పరిష్కార వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని సూచించారు. విధిలైట్లు పగటి పూట వెలగకుండా పర్యవేక్షణను కట్టుదిట్టం చేయాలని ఆదేశించారు.కరెంటోళ్ల జనబాట కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించి, ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు.విద్యుత్ ప్రమాదాలు జరగకుండా గ్రామాల్లో భద్రతా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో విద్యుత్ భద్రతపై అవగాహన పెంపొందించాలని ఆదేశించారు. అనంతరం బోయినపల్లి లో జరిగిన జన బాట కార్యక్రమంలో ప్రజలను విద్యుత్ సమస్యలను తెలుసుకున్నారు. రాజంపేట డివిజన్‌లోని రాజంపేట, నందలూరు, వొంటిమిట్ట, సిద్దౌట్, సుండుపల్లి, వీరబల్లి మండలాల్లో మొత్తం 4,051 ఎస్సీ,ఎస్టీ సర్వీసులకు 5.82 కోట్ల వ్యయంతో సోలార్ రూఫ్‌టాప్ వ్యవస్థలు ఉచితంగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.ఈ సమీక్ష సమావేశంలో సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ ప్రసన్నాంజనేయులు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజశేఖర్ రెడ్డి, డీఈఈలు, ఏఈలు, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి శుక్రవారం 'డ్రై డే' పాటించాలి

### జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఖాజా మొనద్దీన్

**వేంపల్లి: మే 15 ప్రభాతవార్త**

మండల పరిధిలోని అయ్యవారిపల్లె గ్రామంలో జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఖాజా మొనద్దీన్ ఆధ్వర్యంలో 'ఫ్రైడేడ్రైడే' (శుక్రవారం పొడి రోజు) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలోని పలు వీధుల్లో పర్యటించి, నిల్వ ఉన్న నీటిని పరిశీలించారు. ఈ కార్యక్రమం ఉద్దేశించి డాక్టర్ ఖాజా మొనద్దీన్ చేసిన కీలక సూచనలు. వర్షాకాలం దృష్ట్యా నీరు నిల్వ ఉండే చోట దోమలు చేరి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం తప్పనిసరిగా డ్రై డే పాటించాలి. ఇంట్లోని ఎయిర్ కూలర్లు, ఫ్రిజ్ వెనుక భాగం, పూల కుండీలు, పాత టైర్లు మరియు పగిలిన డబ్బాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని కోరారు. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. జ్వరం వచ్చిన వెంటనే నిర్లక్ష్యం చేయకుండా సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని తెలిపారు. దోమల నియంత్రణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి. నిల్వ ఉన్న నీటిపై ఆయిల్ బాల్స్ వేయడం లేదా బ్లీచింగ్ పౌడర్ చల్లడం వంటి చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పృథ్వి కుమార్ రెడ్డి, సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య, సీనియర్ అసిస్టెంట్ నరేష్, సూపర్ వైజర్లు అంకయ్య, అరుణాదేవి, సి.హెచ్.ఓ. భరణి, ఆరోగ్య కార్యకర్త భారతి, ఆశా కార్యకర్త వసుంధర తదితరులు పాల్గొన్నారు.



## జనతా వారిదిలో వినతులు స్వీకరణ



**కడప కార్పొరేషన్ మే 15 ప్రభాతవార్త:**

ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తామని బిజెపి జిల్లా అధ్యక్షుడు జంగిటి వెంకటసుబ్బారెడ్డి, జనతా వారిది కన్వీనర్ జిఎస్టి లక్ష్మణరావు తెలిపారు. శుక్రవారం కడప బిజెపి కార్యాలయంలో జనతా వారిది భాజపా నాయకులు కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా. మార్కెట్ యార్డ్ చైర్మన్ నాగరాజు, జిల్లా అధ్యక్షుడు జింగిటి వెంకటసుబ్బారెడ్డి, జిల్లా జనతావారధి కో కన్వీనర్లు రామ సుబ్బారెడ్డి, జి ఎస్ టి. లక్ష్మణరావు, ఆర్డిఓ పరిధి, సుబ్బారెడ్డి, కో కన్వీనర్ సురేష్, అన్నమాచార్య మండలం అధ్యక్షులు మజారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల వేగవంతం చేయడమే లక్ష్యం



**ప్రొద్దుటూరు, మే 15, ప్రభాతవార్త**

ప్రజల సమస్యల పరిష్కారం వేగవంతం చేయడమే ప్రజా దర్బార్ లక్ష్యం అని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక నెహ్రూ రోడ్డు లోని టిడిపి కార్యాలయంలో ఆయన ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలందరినీ ఆప్యాయంగా పలకరించి, వారి వ్యక్తిగత మరియు సామాజిక సమస్యలను వినతులను సావధానంగా ఆలకించి, వచ్చిన ప్రతి విజ్ఞప్తిని, అర్జీని స్వీకరించి, లవాటిని తక్షణమే పరిష్కరించేందుకు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీర్ఘకాలిక సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి,ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పదే పదే కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, తక్షణమే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి చేరేలా చూడటం, ప్రజల చెంతకే పాలనను తీసుకువెళ్లడం లక్ష్యంగా, ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం చూపడం తమ ప్రధాన బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర షేక్ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముక్తియార్, రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ సంక్షేమ డైరెక్టర్ శ్రీనివాసా చారి, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల నాగరాజు, జిల్లా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు బద్వేలు శ్రీనివాసుల రెడ్డి, టిడిపి కడప పార్లమెంట్ అధికార ప్రతినిధి ఘంటసాల వెంకటేశ్వర్లు, కడప పార్లమెంట్ కార్యదర్శి తలారి పుల్లయ్య, పట్టణ అధ్యక్షుడు చల్లా రాజగోపాల్ యాదవ్, పట్టణ ఉపాధ్యక్షుడు ఖలీల్ భాష, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకట కొండయ్య, మైనారిటీ నాయకులు మున్నా, పుల్లయ్య, కుళాయిరెడ్డి, కట్టమీది రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

### స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర సాధనలో

# మరో అడుగు ముందుకేయాలి

### జిల్లాకు "స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర" అవార్డు రావడం అభినదనీయం

**కడప, మే 15 ప్రభాతవార్త:**

స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర సాధనలో భాగంగా మరో అడుగు ముందుకేసి రాష్ట్ర ప్రభుత్వ నూతన విధి విధానాలను పాటిస్తూ జిల్లాను స్వచ్ఛంగా ఆరోగ్యవంతంగా మార్చాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. శుక్రవారం రాత్రి "స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర ప్రదేశ్ " అమలుపై ముఖ్యమంత్రి చంద్రబాబు అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ కార్యక్రమానికి స్థానిక కలెక్టర్ బోర్డు మీటింగ్ హాలు నుండి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, కేఎంసి కమిషనర్ హెచ్.ఎస్. భావన హాజరయ్యారు. విసి అనంతరం సంబందిత అధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు మంచి ఆలోచనలు, ఆరోగ్యవంతమైన శరీరం, స్వచ్ఛమైన వాతావరణం, ఇంటి దగ్గర, పనిచేసే చోట పరిశుభ్రతలతో మన రాష్ట్రాన్ని స్వర్ణ ఆంధ్రగా, స్వచ్ఛ ఆంధ్రగా తీర్చిదిద్దుకుందామని.. అలాగే వైఎస్ఆర్ కడప జిల్లాను కూడా స్వచ్ఛ జిల్లాగా తీర్చి దిద్దేందుకు జిల్లా ప్రజలు బాధ్యత తీసుకునేలా అవగాహన పెంచి.. ఆ మేరకు స్వచ్ఛత వైపు ఒక ముందడుగేద్దామన్నారు. మూడవ శనివారాన్ని "స్వచ్ఛ దివస్" గా పాటించి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందన్నారు. స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర పాటించి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దామని పిలుపునిచ్చారు.ముఖ్యమంత్రి సూచనల మేరకు.. స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమాన్ని, రాష్ట్ర ప్రభుత్వంని వేస్ట్ మేనేజ్మెంట్ అమలుకు నూతన జీవోను విడుదల చేయడం జరిగిందన్నారు. సిటిజెన్ ఫీడ్ బ్యాక్ తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. పట్టణాల్లో మ్యాజిక్ డ్రెయిన్స్, స్వచ్ఛ రథం, స్వచ్ఛపథం అనే నూతన కార్యక్రమాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టడం జరిగిందని ఆ కార్యక్రమాలను జిల్లాలో నిరాటంకంగా అమలు చేయాలన్నారు. నగర, పట్టణాల సుందరీకరణ, అన్ని పాఠశాలల నుండి వ్యర్థాలను సేకరించడం, ఎస్టీపి/ఎన్ఎస్టీపిల నిర్వహణ, స్థల సేకరణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర సాధనలో భాగంగా ఇప్పటివరకు అత్యుత్తమ సేవలందించి ఉత్తమ అవార్డులకు ఎంపికైన జిల్లాకు చెందిన పీఆర్ శాఖకు జిల్లా కలెక్టర్ అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సీఈవో సుబ్రహ్మణ్యం, సీపీవో హాజరతయ్య, కేఎంసి అదనపు కమీషనర్ రాకేష్ చంద్రం, డీపీవో వెంకట సుబ్బయ్య, మున్సిపల్ కమిషనర్లు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, సంబందిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.









## పలువురికి మజ్జిగ వితరణ



బద్వేల్ అర్బన్, మే 15 ప్రభాతవార్త:
అకాల మరణం చెందిన బిజీవేముల స్వాతి ఆత్మకు శాంతి కలగాలని శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన మజ్జిగ వితరణ కార్యక్రమం ఎందరో పాదాచార్యుల దాహార్తిని తీర్చింది. వేసవి తీవ్రతను, భానుడి భగభగలను దృష్టిలో ఉంచుకుని మంచినీటి చలివేంద్రం ప్రాంగణంలో ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 400 మందికి పైగా మజ్జిగను పంపిణీ చేశారు. ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ స్టేట్ డైరెక్టర్ కె.వి. సుబ్బారావు, పోకల సుబ్బారెడ్డి, ప్రముఖ విద్యావేత్త సి.వి. నాగేశ్వరరావు, రామకోటి రాజు, నేలపాటి వెంకటసుబ్బయ్య ఈ కార్యక్రమానికి హాజరై మజ్జిగను వితరణ చేశారు.

## నందలూరులో రైళ్ల నిలుపుదలకు వినతి

నందలూరు, మే 15 ప్రభాతవార్త :



నందలూరు రైల్వే స్టేషన్‌లో వెంకటాద్రి, రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌లతో పాటు ముంబై–చెన్నై రైళ్లకు నిలుపుదల కల్పించాలని సౌత్ కోస్ట్ రైల్వే డిప్యూటీ జనరల్ మేనేజర్ వై. బాలాజీ కిరణ్‌ను రైల్వే స్టేషన్ కన్సల్టేటివ్ మెంబర్ రాచూరి మురళి కోరారు. ప్రధాన రైళ్లు ఆగకపోవడంతో విద్యార్థులు, ఉద్యోగులు, మండల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన వివరించారు. ఈ అంశంపై రైల్వే అధికారులు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

### లబ్ధిదారుల ఇంటి వద్దకే

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

నూతన ఒరవడికి శ్రీకారం చుట్టిన టిడిపి మాజీ ఇంచార్జ్ వీర ప్రవీణ్ రెడ్డి



ప్రొద్దుటూరు మే 15 ప్రభాతవార్త
ఎంతో ప్రతిష్టాత్మకంగా రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య భద్రతలో భాగంగా సీఎం సహాయ నిధి ద్వారా లబ్ధిదారులకు మంజూరు చేస్తున్న చెక్కులను టిడిపి మాజీ ఇంచార్జ్ జి వీర ప్రవీణ్ కుమార్ రెడ్డి శుక్రవారం లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి చెక్కులు పంపిణీ చేసి నూతన వరవడికి శ్రీకారం చుట్టారు. లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి చెక్కులు పంపిణీ చేయడం ద్వారా బాధితులకు అండగా మేమున్నాం అంటూ భరోసా కల్పిస్తున్నారు అనడంలో సందేహం లేదు. అలాగే ఆ ప్రాంతంలో ఉన్న సమస్యల పైన ప్రజలతో మాట్లాడి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే అవకాశం ఉంటుందన్న సదుద్దేశంతో ప్రవీణ్ చెక్కులు పంపిణీ చేశారు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్‌ను ఆదర్శంగా తీసుకుని ప్రజల వద్దకే ప్రభుత్వ సహాయాన్ని తీసుకొని వెళ్లడం వలన పార్టీ మరియు ప్రభుత్వం పట్ల ప్రజల్లో మంచి అభిప్రాయం కలుగుతుందని ఈ సందర్భంగా ఉక్కు ప్రవీణ్ రెడ్డి తెలిపారు.

## నగలు ఇప్పించి న్యాయం చేయండి

ప్రొద్దుటూరు మే 15 ప్రభాతవార్త



గత 2023లో ఈశ్వర్‌రెడ్డి నగర్‌కు చెందిన బంగారు వ్యాపారి దగ్గర 4 లక్షలకు తనఖా పెట్టిన 79.474 గ్రాముల బంగారును తనకు ఇప్పించి న్యాయం చేయాలని బాధితురాలు నందిత మొరపెట్టుకున్నారు. శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే వరదరాజు రెడ్డి నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఆమె నేరుగా ఎమ్మెల్యే వరదలు కలిసి తన గోడును వినతి పత్రం ద్వారా వినిపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన భర్త క్రాంతి కుమార్ చిట్స్‌లో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్న సమయంలో బంగారు వ్యాపారి దగ్గర బంగారును తనఖా పెట్టి నాలుగు లక్షలను తీసుకున్నామని తెలిపారు. నాలుగు లక్షలు నగదు తీసుకున్న నెల గడిచాక వడ్డీతోపాటు అసలు కూడా బంగారు వ్యాపారికు చెల్లించి బంగారు నగలను విడిపించుకురావాలని కోరినట్లు తెలిపారు. అయితే నగదు తీసుకొని వెళ్ళిన తన బంగారు నగలను తీసుకొని రాకుండా తమను వేధిస్తున్నారని తెలిపారు. ఇదే విషయాన్ని గతంలో ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు కూడా చేశామని అతనిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. తన నగలను తీసుకున్న బంగారు వ్యాపారిపై చర్యలు తీసుకుని తన నగలు ఇప్పించి న్యాయం చేయాలని ఎమ్మెల్యే వరదకు విన్నవించినట్లు తెలిపారు.

### నీట్ పరీక్షల వ్యవహారంలో

## కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలి

ప్రొద్దుటూరు అర్బన్ మే 15 ప్రభాతవార్త



దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న నీట్ పరీక్షలలో వరుసగా జరుగుతున్న అవకతవకలు, పేపర్ లీకులు, పరీక్షా నిర్వహణలో లోపాలు విద్యార్థులు వారి తల్లిదండ్రులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయని మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ (ఎంపీజే) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షైక్ సలీం బాషా పేర్కొన్నారు. లక్షలాది మంది విద్యార్థులు సంవత్సరాల పాటు కష్టపడి చదివి పరీక్షలకు హాజరవుతుంటే, కొందరి నిర్లక్ష్యం మరియు అవినీతి కారణంగా వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారడం దురదృష్టకరమన్నారు. ఇప్పటికే గత సంవత్సరాల్లో కూడా నీట్ పరీక్షలపై అనేక అనుమానాలు వ్యక్తమైనప్పటికీ, కేంద్ర ప్రభుత్వం సంబంధిత సంస్థలు సరైన చర్యలు తీసుకోకపోవడం వల్ల మళ్లీ అదే పరిస్థితులు పునరావృతమవుతున్నాయని విమర్శించారు. పరీక్షల పారదర్శకత, విద్యార్థుల నమ్మకం పూర్తిగా దెబ్బతిన్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ వ్యవహారంపై పూర్తి బాధ్యత వహించాలని, సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సమగ్ర దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల జీవితాలతో ఆటలాడే విధానాలను ప్రజలు ఎప్పటికీ క్షమించరని, విద్యా వ్యవస్థపై నమ్మకం నిలబెట్టేందుకు కఠిన చర్యలు అవసరమని ఆయన అన్నారు. దేశ భవిష్యత్తైన యువత మానసిక ఒత్తిడికి గురికాకుండా కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని ఎంపీజే తరఫున విజ్ఞప్తి చేశారు.

## కానగూడూరులో రెవెన్యూ సదస్సు

దువ్వూరు, మే 15, ప్రభాతవార్త:
మండల పరిధిలోని కానగూడూరు గ్రామంలో శుక్రవారం భూ సమస్యల పరిష్కారం కొరకు రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో తహసిల్దార్ సంజీవరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలలో నాలుగు గ్రామాలలో పర్యటించి రెవెన్యూ సమస్యల పరిష్కారానికి దారి చూపాలని ఆదేశించిందని ఆ మేరకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో రైతులకు, భూ యజమానులకు సంబంధించిన వివిధ రకాల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సదస్సు నందు రెవెన్యూ సిబ్బంది, వీఆర్వో పాల్గొన్నారు.

# పశువుల దొడ్డి మరమ్మత్తులపై ఉద్రిక్తత

రెవెన్యూ పోలీసు సమక్షంలో పశువుల దొడ్డి పనులు

ఒంటిమిట్ట మే 15. ప్రభాతవార్త
మండలం సాలబాదు గ్రామంలో పశువులదొడ్డి వివాదంపై కొట్లాడుకోవడం జరిగింది. అనంతరం గ్రామస్తులు శుక్రవారం రామాలయం వద్ద అదే స్థలంలో పశువుల దొడ్డి మరమ్మత్తులు చేస్తుండగా కొంతమేర ఉద్రిక్తత నెలకొంది. మరమ్మత్తులు ఆక్షాపన చేస్తున్న విషయం గ్రామస్తులు రెవెన్యూ, పోలీసు అధికారులకు సమాచారం అందించడంతో అధికారులు అక్కడికి వెళ్లి పశువుల దొడ్డి మరమ్మత్తులు చేయాల్సిందిగా ఆదేశించారు. అధికారుల ఉత్తర్వుల మేరకు గ్రామస్తులు మరమ్మత్తులు చేపట్టడం జరిగింది. గ్రామంలోని దిగువ ఊరిలో గత 30 సంవత్సరాలుగా రామాలయం వద్ద పశువుల దొడ్డి ఉండేదని కాలక్రమేనా అది పాడైపోవడం జరిగిందని పశువుల దొడ్డి గ్రామంలో ఉండడం కొందరికి ఇష్టం లేదని గ్రామస్తులు అడగగా ఇరువర్గాలు ఘర్షణ పడటంతో ఆసుపత్రుల పాలయ్యారన్నారు. ఇరు వర్గాల ఆరోపణలతో పోలీస్ కేసు నమోదు కావడం జరిగిందన్నారు. మరమ్మత్తులు చేస్తున్న సమయంలో వైసిపి నాయకుల కుట్ర రాజకీయాలతో మహిళలను పంపించి మరమ్మత్తులు కాకుండా చూస్తున్నారని ఉద్రిక్తత పరిస్థితులు లేవనెత్తుతున్నారని టిడిపి వర్గాలు ఆరోపిస్తున్నారు. పశువుల దొడ్డి మరమ్మతులకు ఆటంకం కలిగిస్తున్న విషయం అధికారులకు తెలియజేయడంతో తాసిల్దార్, సర్కిల్ ఇన్స్పెక్టర్ సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని సర్దుబాటు చేసి ఈ స్థలంలో పశువుల దొడ్డి అనాదిగా ఉన్నదన్న విషయం ఆధార పూర్వకంగా పత్రాలను గ్రామస్తులు చూపించడంతో పరిశీలించి మరమ్మత్తులు చేయాల్సిందిగా ఆదేశించడం జరిగింది. అధికారుల అనుమతి ప్రకారం వారి సమక్షంలో గ్రామస్తులు అదే స్థలంలో పశువుల దొడ్డి మరమ్మతులు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వెంకట కృష్ణారెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి, ఎంపీపీ లక్ష్మీదేవి, బుజ్జి, ప్రతాప్ రెడ్డి, లక్ష్మి రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఉదయ్ తోపాటు పలువురు గ్రామస్తులు, కార్యకర్తలు ఉన్నారు.



## కోరం లేక వాయిదా పడ్డ మండల సర్వసభ్య సమావేశం

సిద్ధవటం, మే 15 ప్రభాతవార్త
ఎంపీపీ సభా భవనంలో శుక్రవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడింది 11 మంది ఎంపీటీసీ సభ్యులు ఉండగా ఎంపీపీ మినహా ఎంపీటీసీ సభ్యులు మండల సర్వ సభ్య సమావేశానికి హాజరు కాకపోవడంతో కోరం లేక సమావేశం వాయిదా పడింది ఈ సందర్భంగా మండల అభివృద్ధి అధికారి ఫణి రాజకుమారి మాట్లాడుతూ ఎంపీపీ జ్యోతి వెంకటమ్మ అధ్యక్షన జరగవలసిన సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా వేశామని తదుపరి సమావేశం తేదీ తెలుపుతామని ఆమె తెలిపారు ఈ సందర్భంగా ఎంపీపీ ప్రతినిధి జ్యోతి చంద్రశేఖర్ మాట్లాడుతూ మండల సర్వసభ్య సమావేశానికి ఎంపీటీసీలకు వాట్సాప్ ద్వారా తెలిపారు తప్ప ఎంపీటీసీలకు సరైన సమాచారం లేదని గౌరవం లేనప్పుడు సమావేశానికి ఎందుకు వస్తారు అంటూ ఎంపీడీవో నిర్లక్ష్యంతోనే సమావేశం వాయిదా పడిందని అన్నారు ఈ సమావేశానికి వైద్యం, శాఖ అధికారులు రెవిన్యూ శాఖ అధికారులు గ్రై హాజరయ్యారు, ఈ కార్యక్రమంలో మండల విస్తరణ అధికారి మెహతాబ్ యాస్మిన్, పంచాయతీరాజ్ ఏఈ నాగరాజు,ఎంఈఓ ఆవుల అరుణ, ఆర్డబ్ల్యూఎస్ ఏ ఈ గురుప్రసాద్ మండల వ్యవసాయ అధికారి రమేష్ రెడ్డి, హౌసింగ్ ఏఈ చెన్నయ్య, వెటర్నరీ వైద్యాధికారి డాక్టర్ శివశంకర్, డిప్యూటీ ఎంపీడీవో రవివర్మ ఐసిడిఎస్ సిడిపిఓ శోభారాణి, ఏవో సోమశేఖర్, ఏపీవో నరసింహులు పంచాయతీ కార్యదర్శులు మండల ఎస్సై పోకల హారిక ఆధ్వర్యంలో ప్రతిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.





## ఘనంగా విప్లవ వీరుడు సుఖ్‌దేవ్ జయంతి

- దేశం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల స్ఫూర్తి అజరామరం

ప్రొద్దుటూరు అర్బన్, మే 15, ప్రభాతవార్త
బ్రిటిష్ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి భారత స్వాతంత్ర్య సంగ్రామంలో ప్రాణాలర్పించిన విప్లవ వీరుడు సుఖ్‌దేవ్ థాపర్ జయంతి వేడుకలను శుక్రవారం స్థానిక ఉపాధ్యాయ సేవా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రముఖులు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి పాల్గొని ప్రసంగించారు. భగత్ సింగ్, రాజ్‌గురులతో కలిసి సుఖ్‌దేవ్ విప్లవ మార్గంలో సాగించిన పోరాటం సాటిలేనిదని కొనియాడారు. 1928లో లాలా లజపతి రాయ్ మరణానికి కారణమైన బ్రిటిష్ అధికారి సాండర్స్ పై దాడి చేయడంలో సుఖ్‌దేవ్ కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. కేవలం 24 ఏళ్ల ప్రాయంలోనే, 1931 మార్చి 23న దేశం కోసం చిరునవ్వుతో ఉరికొయ్యను ముద్దాడిన ఆయన త్యాగం వెలకట్టలేనిదని పేర్కొన్నారు. ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయ పాలక మండలి సభ్యులు డాక్టర్ టి.డి వరుణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. "దేశం కోసం జీవించడం గొప్ప విషయం అయితే, దేశ విముక్తి కోసం ప్రాణత్యాగం చేయడం అంతకంటే మహోన్నతమైనది" అని అన్నారు. సుఖ్‌దేవ్ వంటి వీరుల బలిదానాల వల్లే నేడు మనం స్వేచ్ఛా వాయువులు పీల్చుకుంటున్నామని, వారి ఆశయాలు నేటి యువతకు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఎల్.టి.ఏ (స్లటా) రాష్ట్ర కోశాధికారి బోగా గంగాధర్, రిజ్వాన్ అలీ, వారాధి మధు, కె పి ఓబుల రెడ్డి,బాబా, షేక్ షావల్లి, భాస్కర్ రెడ్డి మరియు పలువురు ఉపాధ్యాయులు పాల్గొని అమరవీరుల సేవలను స్మరించుకున్నారు.



## గత వైసీపీ హయాంలో అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

పులివెందుల, మే 15 , ప్రభాతవార్త :
గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అధికార బలంతో అక్రమాలకు పాల్పడిన వారిపై సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని తెలు గుదేశం పార్టీ నాయకుడు అక్కులగారి విజయ్‌కుమార్‌రెడ్డి, మహబూబ్ బాషాలు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయం నందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా పులివెందులలో పోలీసుల పనితీరు పక్షపాతంగా సాగిందని ఆయన ఆరోపించారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రాకముందు వైసీపీ హయాంలో సామాన్య కార్యకర్తల నుంచి ముఖ్య నాయకుల వరకు పలువురిపై అక్రమ కేసులు నమోదు చేసి వేధింపులకు గురి చేశారని విమర్శించారు. సోషల్ మీడియాలో ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించిన వారిపై కూడా కేసులు నమోదు చేశారన్నారు. విజయ్‌కుమార్ హరి మాట్లాడుతూ 2020లో బీసీలకు జరు గుతున్న అన్యాయంపై సోషల్ మీడియాలో పోస్టు పెట్టినందుకు అప్పటి పోలీసులు తనపై దాడి చేసి మానసికంగా వేధించారని విజయ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. చిన్న విషయాన్ని పెద్ద నేరంగా చూపించి తనను రిమాండ్‌కు పంపించారని తెలిపారు. అప్పట్లో అధికార పార్టీ నేతల ఒత్తిడితో అధికారులు వ్యవహరించారని అన్నారు. రైల్వే ఉద్యోగాల పేరుతో మోసపోయిన బాధితులకు న్యాయం చేయాలని కోరిన సందర్భంలో తనపై కిడ్నాప్ కేసు నమోదు చేసి 40 రోజుల పాటు జైలులో ఉంచారని ఆయన తెలిపారు. పలువురు బాధితుల భూములను నకిలీ పత్రాలతో ఆక్రమించుకున్న ఘటనలపై ఫిర్యాదులు చేసినా సరైన న్యాయం జరగలేదని ఆరోపించారు. అంబకపల్లి నాగరాజు హత్య కేసుతో పాటు ఇతర అక్రమ వ్యవహారాల్లో కొందరు వ్యక్తుల ప్రమేయం ఉన్న ప్పటికీ అధికార బలంతో బయటపడ్డారని ఆయన విమర్శించారు. ప్రస్తుతం కూడా అమాయక కార్యకర్తలపై దాడులు చేయిస్తూ పోలీసులను ప్రభావితం చేస్తున్నారని ఆరోపించారు. తమ పార్టీకి చెందిన నేతల ఫ్లెక్సీల ధ్వంసంపై ఫిర్యాదులు చేసినప్పటికీ పోలీసులు స్పందించడం లేదని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇకనైనా పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించి గత అక్రమాలపై పునర్విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని విజయ్ కుమార్ రెడ్డి కోరారు.ప్రస్తుతం పులివెం దులలో శాంతిభద్రతల పరిస్థితి మెరుగుపడటం సంతోషకరమని, అయితే అక్రమాలకు పాల్పడే వారిని ఉపేక్షించరాదని స్పష్టం చేశారు.



# మంచి ఆలోచనతో అడుగేయాలి





ముఖ్యంగా మైదుకూరు నియోజకవర్గంలో చేపట్టే ప్రతి అభివృద్ధి కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ప్రోత్సాహం ఎంతో ఉందన్నారు. జిల్లాలో వినూత్న ఆలోచనలతో సరికొత్త ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టడం ఆయన ప్రత్యేకత అన్నారు. జిల్లాలో చేయపట్టిన స్మార్ట్ కిచెన్ వ్యవస్థకు రాష్ట్రములోని కాకుండా జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చిందన్నారు. మన ప్రాంతంలో చెరువులు, సాగు నీటి కాలువలు, తదితర అన్ని రకాల ఇరిగేషన్ పనుల అభివృద్ధికి జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ ముందుందన్నారు. కార్యక్రమంలో 10వ తరగతి పరీక్షల ఫలితాల్లో జిల్లాలో ద్వితీయ స్థానం సంపాదించిన శెట్టి వారి పల్లి గ్రామానికి చెందిన విద్యార్థిని జిల్లా కలెక్టర్ సత్కరించారు. అంతకుముందు ముదిరెడ్డిపల్లెలో నూతనంగా నిర్మించిన రామలయాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్, ముదైరెడ్డిపల్లె చెరువును పరిశీలించి చెరువులో అభివృద్ధికి సంబంధించి పనుల ప్రణాళికల గురించి అధికారులతో మాట్లాడారు. 2014 టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు హామీ ఇచ్చారు. కానీ జరగలేదు, 2019 గత వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కూడా ఇలానే మాటలు చెబుతూ కాలయాపన జరిగిపోయింది. ఇప్పటికైనా ముదిరెడ్డిపల్లి మరియు తిప్పిరెడ్డిపల్లి చెరువులకు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా రెండు గ్రామాలకు నీరు అందించడం అ హామీ నెరవేరాలని కోరుకుంటూ గతం జరిగినవి పక్కన పెడితే కూటమి ప్రభుత్వంలో పుట్టా సుధాకర్ యాదవ్ ఆధ్వర్యంలో ప్రజలు ఎన్నో ఆశించి ఉన్నారు. ఆ దిశలో రెండు గ్రామాల ప్రజలకు మేలు జరగాలని కోరుకుందాం. ఈ కార్యక్రమంలో బద్వేలు ఆర్డీఓ చంద్రమోహన్, డ్వామా, డీఆర్డీఏ పిడీలు అదిశేషారెడ్డి, రాజ్యలక్ష్మి, స్థానిక నాయకులు, సాగునీటి సంఘాల సభ్యులు, ఇరిగేషన్ అధికారులు, మరియు పెద్ద సంఖ్యలో రైతులు, పొదుపు సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## భక్తుల కోసం 10 స్నానపు ఘట్టాలు ఏర్పాటు

బ్రహ్మంగారిమఠం మే 15 ప్రభాతవార్త
ప్రముఖ పుణ్యక్షేత్రమైన బ్రహ్మంగారిమఠంలో భక్తుల సౌకర్యార్థం 10 స్నానపు ఘట్టాలను శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి మఠం మఠాధిపతులు శ్రీ వీరధర్మజ వెంకటాద్రి స్వామి ఆధ్వర్యంలో నిర్మాణం చేపడతామని మేనేజర్ ఈశ్వరయ్య చారి తెలియజేశారు.గుడికి తూర్పు భాగాన గోశాలకు వెనుక భాగంలో స్నాన ఘట్టాలు ఏర్పాటు చేయడానికి నిర్ణయించుకున్నట్లు ఆయన తెలియజేశారు.వీటిని రెండు నెలల్లో పూర్తి చేస్తామన్నారు.వీటిని నిర్మించిన తరువాత యాత్రికులకు ఉచితంగా స్నానాలు చేసుకొనుటకు ఉపయోగిస్తామని ఆయన వివరించారు.వచ్చే ఏడాది నుంచి భక్తుల సౌకర్యార్థం చెప్పులు భద్రపరుచుటకు వసూలు చేయు రుసుమును అలాగే లెట్రిన్ కు పోవు యాత్రికులకు నుంచి రాబట్టు రుసుమును తీసుకోకుండా ఉచితంగానే ఏర్పాటు చేయుటకు మున్ముందు ప్రయత్నం చేస్తామని ఆయన మనసులోని మాటను వెలిబుచ్చారు.ప్రస్తుతం పై రెండు వాటికి టెండర్లు వేయడంతో ఈ ఏడాది వాటిని కొనసాగిస్తామని, వచ్చే ఏడాది చెప్పులు, లెట్రిన్ టెండర్లను వేయకుండా భక్తులకు ఉచితంగానే ఏర్పాటు చేయుటకు నిర్ణయం తీసుకోనున్నట్లు ఆయన వెల్లడించారు.

## పడకేసిన పారిశుద్ధ్య పనులు

పట్టించుకోని అధికారులు... కంపు కొడుతున్న రహదారి



సిద్ధవటం మే 15 ప్రభాతవార్త
పారిశుధ్యం పడక వేయడంతో దోమల వ్యాప్తి చెంది విష జ్వరాలు సోకే ప్రమాదం ఉందని ప్రజలు మండిపడ్డారు మండల కేంద్రమైన సిద్ధవటంలోని మఠంవీధిలో మురుగునీరు, పారిశుద్ధ్యం లోపం వల్ల దోమలు వ్యాప్తి చెంది విష జ్వరాలు సోకే ప్రమాదం ఉందని రహదారులు కంపు కొడుతున్న పారిశుధ్యం తొలగింపు చర్యలు చేపట్టలేదని ఆ ప్రాంతవాసులు శుక్రవారం తెలిపారు ఈ విషయమై మండల విస్తరణ అధికారి మెహతాబ్ యాస్మిన్ వివరణ కోరగా మఠం వీధిలో ఉన్న పారిశుద్ధాన్ని మరియు మురిగినీరు తొలగింపు చర్యలు చేపట్టేందుకు యుద్ధ ప్రాథమిక దిశగా చర్యలు తీసుకొని పారిశుధ్య కార్మికులు చేత పనులు చేయించి బ్లీచింగ్ పిచికారి చేస్తామన్నారు.

## సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు

దువ్వూరు, మే 15, ప్రభాతవార్త:
మండల పరిధిలోని రైతులకు 15 రైతు సేవా కేంద్రాల ద్వారా సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు మంజూరు అయ్యాయని, వాటి కొరకు ఈనెల 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి అమర్ నాథ్ రెడ్డి అన్నారు. దువ్వూరు మండలానికి 3 ట్రాక్టర్లు, 4 ట్రాక్టర్ పరికరాలు, బయర్ లు 34, మిగతా పరికరాలు కూడా మంజూరు చేశారన్నారు. ఇవి 40 శాతం సబ్సిడీపై రైతులకు అందజేస్తారని అవసరమైన రైతులు ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎవరికైనా దరఖాస్తు చేసుకునే విధానం తెలియకపోతే సమీపంలోని రైతు సేవా కేంద్రానికి వెళ్లి దరఖాస్తు చేసుకోవచ్చు అన్నారు. దరఖాస్తులు ఈ నెల 20వ తేదీ లోగా చేసుకున్న తర్వాత పది రోజులలో గా వచ్చిన దరఖాస్తులను లాటరీ పద్ధతిలో వేసి ఎంపికైన లబ్దిదారులకు అందజేస్తామన్నారు. మండల రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

## 16న జాతీయ డెంగ్యూ దినోత్సవం

వేంపల్లి మే 15 ప్రభాతవార్త
జాతీయ డెంగ్యూ దినోత్సవంఖి సందర్భంగా ఈ కార్యక్రమములో జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఖాజా మోనద్దీన్ వేంపల్లి మండలములోని తాళ్లపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు మాట్లాడుతూ డెంగ్యూ పట్ల ప్రజల్లో అవగాహన పెంచడం మరియు వ్యాధి వ్యాప్తిని అరికట్టడమే లక్ష్యంగా డెంగ్యూ నివారణ మనందరి సామాజిక బాధ్యత కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు తెలిపారు.

## తాగునీటి సమస్యపై స్పందించిన సింగారెడ్డి

సొంత నిధులు వెచ్చించి తాగునీటి సమస్య పరిష్కారం



వేంపల్లె: మే 15 ప్రభాతవార్త
మండలంలోని చింతలమడుగు పల్లి గ్రామ సమీపంలో ఉన్న జగనన్న కాలనీలో గత వారం రోజులుగా తాగునీటి సమస్య నెలకొంది. తాగునీటి మోటర్ మరమ్మత్తులకు గురి కావడంతో ఈ సమస్య నెలకొంది. దీంతో కాలనీ ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయం పై కాలనీ వాసులు జిల్లా టీడీపీ మాజీ కార్యదర్శి సింగారెడ్డి జయరామిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పలితం లేదని, గత వారం రోజులుగా తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే తాగునీటి సమస్యను పరిష్కరించాలని జయరామిరెడ్డి ని కోరారు. స్పందించిన జయరామిరెడ్డి తాగునీటి సమస్య లేకుండా వెంటనే పరిష్కరిస్తానని హామి ఇచ్చారు. వెంటనే తన సొంత నిధులు వెచ్చించి ప్రయివేటు మెకానిక్‌లతో మాట్లాడి మోటర్ మరమ్మత్తులు బాగు చేయాలని ఆదేశించారు. ఈ విషయం పై జయరామిరెడ్డి కుమారుడు టీడీపీ యువ నాయకుడు సింగారెడ్డి శివకృష్ణా రెడ్డి (బుజ్జి) దగ్గరుండి మోటర్ కు మరమ్మత్తులు చేయించారు. దీంతో జగనన్న కాలనీలో తాగునీటి సమస్య పరిష్కారం అయింది. అడిగిన వెంటనే తమ సొంత నిధులతో తాగునీటి సమస్యను పరిష్కరించినందుకు ఆ కాలనీ వాసులు సింగారెడ్డి జయరామిరెడ్డి, శివకృష్ణా రెడ్డి (బుజ్జి) లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆకుల సురేష్, నల్లమేకల రామాంజనేయులు, రమణ, యోగీశ్వరరెడ్డి, ఆంజనేయులు, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

## ప్రజాసేవే లక్ష్యంగా మానవత సంస్థ

వేంపల్లె మే 15 ప్రభాతవార్త
రాజీవ్ నగర్ కాలనీలో దాతల సహకారంతో బాడీ ఫ్రీజర్స్ నిల్వ ఉంచేందుకు ఏర్పాటు చేసిన నూతన భవనాన్ని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఛైర్మన్ చక్రపాణి రెడ్డి, మండల శాఖ అధ్యక్షులు డాక్టర్ యోగీశ్వర బాబు, మానవత కుటుంబ సభ్యులు కలిసి ఘనంగా ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మానవతా ఛైర్మన్ చక్రపాణి రెడ్డి మాట్లాడుతూ సమాజ సేవలో భాగంగా మానవత సంస్థ నిరంతరం ప్రజలకు అండగా నిలుస్తోందని తెలిపారు. బాడీ ఫ్రీజర్స్ అవసరం అనేది ప్రతి కుటుంబానికి ఎప్పుడో ఒకప్పుడు ఎదురయ్యే పరిస్థితి కావచ్చని, అలాంటి సమయంలో పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఈ సేవ ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ నూతన భవన నిర్మాణానికి అవసరమైన నిధులను దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి అందించడం అభినందనీయమని కొనియాడారు. మానవత మండల శాఖ అధ్యక్షులు డాక్టర్ యోగీశ్వర బాబు మాట్లాడుతూ మానవత సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని తెలిపారు. దాతల సహకారం ఎప్పటికి మరువలేనిదని అన్నారు. అలాగే భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు ఉపయోగపడే విధంగా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మానవత సభ్యులు రంగయ్య, చల్లా బాలాజీ, సుభాష్, గంగయ్య, రామమునిరెడ్డి, దాతలు తదితరులు పాల్గొన్నారు.






# తెలుగుదేశం జోనల్ కోఆర్డినేటర్ల నియామకం

రాజంపేట దామచర్ల సత్య

కడప పెళ్ళకూరు శ్రీనివాసులురెడ్డి

అనంతపురం, హిందూపురం వాసు

**రాజంపేట, మే 15 ప్రభాతవార్త**

తెలుగుదేశంపార్టీలో కీలకమైన జోనల్ కోఆర్డినేటర్లకు తాజాగా వివిధ పార్లమెంట్ నియోజకవర్గాలను కేటాయిస్తూ పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో జరిగిన కేటాయింపులను మార్పు చేశారు. తాజాగా రాజంపేట పార్లమెంటు నియోజకవర్గ జోనల్ కోఆర్డినేటర్ గా దామచర్ల సత్యాను నియమించారు. అలాగే కడప పార్లమెంట్ నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా నెల్లూరు జిల్లాకు చెందిన పెళ్ళకూరు శ్రీనివాసులు రెడ్డిని నియమించారు. ఈమెరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. మరోవైపు కడప కీలక నేత రెడ్డప్ప గారి శ్రీనివాస్ రెడ్డి (వాసు) ని అనంతపురం, హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గాలకు జోనల్ కోఆర్డినేటర్గా నియమించారు.


పెళ్ళకూరు శ్రీనివాసులురెడ్డి


దామచర్ల సత్య

## మహిళల రక్షణ, సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



**మదనపల్లెక్రైమ్, మే 15 ప్రభాతవార్త.**

సమాజంలో మహిళల భద్రత, సైబర్ నేరాల పట్ల అప్రమత్తత అవసరమని వన్ టౌన్ సి ఐ రాజారెడ్డి తెలిపారు. జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆదేశాల మేరకు మదనపల్లి పట్టణంలోని మెప్మా కార్యాలయంలో మహిళలకు ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ మహిళలు, యువతుల రక్షణ కోసం పోలీస్ శాఖ తీసుకుంటున్న చర్యలను వివరించారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో సామాజిక మాధ్యమాలు, నకిలీ ఫోన్ కాల్స్, ఆన్‌లైన్ లావాదేవీల ద్వారా జరుగుతున్న మోసాల పట్ల ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. గుర్తుతెలియని లింకులు క్లిక్ చేయవద్దని, ఓటీపీలు పంచుకోవద్దని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించటం, హెల్మెట్ ధరించడం, అతివేగాన్ని నియంత్రించుకోవడం ద్వారా ప్రాణాలను రక్షించుకోవచ్చన్నారు. యువతను పాడు చేస్తున్న గంజాయి, డ్రగ్స్ వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని, సమాజంలో ఇలాంటి అక్రమ రవాణా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. మహిళలకు ఎటువంటి సమస్యలు ఉన్న తక్షణమే స్పందించేందుకు వీలుగా పోలీస్ శాఖ టోల్‌ఫ్రీ నంబర్ల 100, 112 ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మదనపల్లి వన్ టౌన్ పోలీస్ సిబ్బంది, శక్తి టీమ్ ప్రతినిధులు, మెప్మా అధికారులు, మహిళలు పాల్గొన్నారు.

## పురాతన ఆలయాలకు దూపదీప నైవేద్య పథకం

జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖాధికారి విశ్వనాథ్.



**గాలివీడు: మే 15. ప్రభాతవార్త :**

జిల్లాలోని పురాతన ఆలయాల్లో దూపదీప నైవేద్యం నిర్వహణకు నోచుకోని దేవాలయాలకు మాత్రమే ప్రభుత్వం దూపదీప నైవేద్య పథకాన్ని మంజూరు చేస్తోందని జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖాధికారి విశ్వనాథ్ తెలిపారు. శుక్రవారం మండలంలోని తలముడిపి గ్రామంలో ఉన్న శ్రీ భైరవేశ్వర స్వామి ఆలయాన్ని ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భైరవేశ్వర స్వామి ఆలయానికి దూపదీప నైవేద్య పథకం మంజూరైనట్లు తెలిపారు. ఆలయాల్లో పథకం అమలు తీరును ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నామని పేర్కొన్నారు. గోపురం, మూలవిరాట్ మూర్తి, ధ్వజస్తంభం ఉన్న పురాతన ఆలయాలకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుందని వెల్లడించారు.రాష్ట్ర రవాణా, యువజన క్రీడల శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి సిఫారసులతో ఎస్సీ, ఎస్టీ, బీసీ నివాస ప్రాంతాల్లో శ్రీవాణి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆలయాల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. అలాగే సీజీఎఫ్ నిధులతో పలు ఆలయాల పునర్నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని చెప్పారు.అనంతరం సమీపంలోని శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు భక్తవత్సల శర్మ జిల్లా అధికారికి శాలువా కప్పి, పూలమాల వేసి ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, మాజీ నీటి సంఘం అధ్యక్షులు రెడ్డెప్ప రెడ్డి, శ్రీ భైరవస్వామి ఆలయ అర్చకులు మహేశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై చర్యలు తీసుకోండి


కార్మికుల సమస్యలపై నిరసన తెలుపుతున్న దృశ్యం

**మదనపల్లె, మే 15 ప్రభాతవార్త :**

విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలపై చర్యలు తీసుకోవాలని దీనిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించుకోవాలని సూచించారు. ఏపి ఎలక్ట్రిసిటి కాంట్రాక్టు ఎంప్లాయిస్ అసోసియేషన్ జి.3045 యూనియన్ ఆధ్వర్యంలో సోషల్ మీడియా ఉద్యమాన్ని ప్రారంభించింది. ఈ ఉద్యమం రాష్ట్ర వ్యాప్తంగా డివిజన్, సబ్ డివిజన్ స్థాయిలో విజయంతంగా నిర్వహించి కార్మికుల్లో చైతన్యం కల్పిస్తొందన్నారు. సోషల్‌మిడియా ఉద్యమ నాయకులు ఎస్ యశ్వంత్, లక్ష్మినారాయణ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు, కార్మికులు కిరణ్‌కుమార్, రమేష్‌బాబు, మునివెంకోబారావు, శ్రీకాంత్ రాజశేఖర్ ఆనందరెడ్డి, శివ, శ్రీనాథ్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

# శరవేగంగా చెరువు సుందరీకరణ పనులు

## వార్త కథనానికి స్పందన

**పీలేరు మే 15 ప్రభాతవార్త:**

పీలేరు అయ్యప్పనేని చెరువు సుందరీకరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇదే చెరువు సుందరీకరణ పనులు పై గత నవంబర్లో ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి పీలేరు నీటిపారుదల , పంచాయితీ, రెవెన్యూ, గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులతో చెరువు సుందరీకరణ అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అప్పట్లో చెరువును చుట్టుకొలత వేసి ఆక్రమణలు జరిగి ఉంటే తొలగించాలని యుద్ధ ప్రాతిపదినా చిరు సుందరీకరణ పనులు చేపట్టాలని అప్పట్లో ఎమ్మెల్యే సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. అనంతరం సంబంధిత శాఖల అధికారుల లో ఎలాంటి స్పందన లేకపోయింది. ఫలితంగా సుందరీకరణ పనులు ముందుకు సాగలేదు. ఇదే అంశంపై ఈనెల 7 వ తేదీన వార్తాపత్రికలో సుందరీకరణ పనులకు పడని అడుగులు అనే శీర్షిక నా వార్తా కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్ రెడ్డి సంబంధిత రెవెన్యూ నీటిపారుదల శాఖ గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులతో అత్యవసర సమావేశం అయ్యారు. రూ. 12 కోట్ల అంచనా వ్యయంతో చెరువు సుందరీకరణ పనులు చేపట్టాలని తీర్మానించారు. ఈ మేరకు ప్రభుత్వానికి నివేదిక పంపారు. ఇప్పటి వరకు ఈ సందర్భంగా చెరువు సుందరీకరణ పనులు నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వీలైనంత త్వరగా చెరువు సుందరీకరణ


అయ్యప్ప నేని చెరువు సుందరీకరణ పనులలో భాగంగా జెసిబి తో ముళ్లపొదలు తొలగిస్తున్న దృశ్యం

పనులు ప్రారంభించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. శరవేగంగా పనులు జరుగుతున్నాయి. ఇదిలా ఉంటే చెరువు సుందరీకరణ పనులు వాటర్ శాఖకు అప్పజెప్పారు. ఈ శాఖ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు చెరువు చుట్టుకొలతను వేశారు. ఈ మేరకు చెరువు చుట్టూ ఉన్న ముళ్ళ పొదలను తొలగించే పనులు చేపడుతున్నారు. ఈ పనులు శరవేగంగా సాగుతున్నాయి. సుందరీకరణ పనులు పూర్తి అయితే నీటి శుద్ధి ప్రాజెక్ట్ ప్రారంభించే అవకాశం ఉంటుందని సంబంధిత శాఖ అధికారులు అంటున్నారు.

## స్వచ్ఛరథం విజయవంతం కూటమి ప్రభుత్వ ఘనతే



**తంబళ్లపల్లె మే 15 ప్రభాతవార్త ః**

నాటి వైకాపా ప్రభుత్వం చెత్త పై పన్ను వేస్తే స్వచ్ఛ రథం ద్వారా చెత్తను సైతం ఆదాయ వనరుగా మార్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వానికే దక్కిందని టిడిపి నేతలు తెలుగు యువత నరసింహులు, సీనియర్ నాయకుడు బాలకృష్ణారెడ్డి, బీసీ నేతలు పురుషోత్తం, సామి రెడ్డి, రాచెరువు సంఘం అధ్యక్షుడు రామలింగారెడ్డి కొనియాడారు. శుక్రవారం తంబళ్లపల్లి మండల కేంద్రంలో స్వచ్ఛ రథం నిర్వహణ పై ఎంపీడీవో ఎంవి ప్రసాద్, ఏవో థామస్ రాజా, డిప్యూటీ ఎంపీడీవో మారుతీ కుమార్, కార్యదర్శిలు శ్రీనివాసరావు, ఈశ్వర్ రెడ్డి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఇదే స్ఫూర్తితో వినియోగదారులకు పనికిరాని వస్తు సామాగ్రికి సరిపడా ఇంటి సరుకులు పంపిణీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ భాస్కర్, వెంకట్ రెడ్డి, చాకనా వెంకటరమణ, హరినాథ్, ప్రజలు, వినియోగదారులు పాల్గొన్నారు.

## సిపిఎల్ 2 లో వరుస విజయాలతో పాయ్ వైస్రాయ్ జట్టు


మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా వినయ్ కుమార్

**వాల్మీకిపురం మే 15: , ప్రభాతవార్త :**

స్థానిక సీడీసీఏ, జీవీఎస్‌సీఎస్ క్రికెట్ క్రీడామైదానంలో జరుగుతున్న సీపీఎల్2 సీజన్ క్రికెట్ పోటీలు ఉత్కంఠ భరితంగా సాగుతున్నాయి. శుక్రవారం జరిగిన క్రికెట్ పోటీల్లో ఉదయం ఎన్కేస్పోర్ట్స్ క్రికెట్ జట్టు, పాయ్ వైస్రాయ్ క్రికెట్ జట్లు పోటా పోటిగా తలపడ్డాయి. ఇరు జట్లు మధ్య జరిగిన హోరా హోరి పోరులో పాయ్ వైస్రాయ్ క్రికెట్ జట్టు సమిష్టి స్ఫూర్తితో విజయం సొంతం చేసుకుంది. సీపీఎల్2లో వరుస విజయాలతో పాయ్ వైస్రాయ్ జట్టు జైత్రయాత్ర కొనసాగిస్తుంది.. అలాగే మధ్యాహ్నం స్పార్టన్ వారియర్స్ క్రికెట్ జట్టు, ఆదిత్య అండ్ బీఆర్ క్రికెట్ జట్లు మధ్య హోరాహోరి పోరులో జట్టు సమిష్టి కృషితో స్పార్టన్ వారియర్స్ జట్టు విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ టోర్నమెంట్లో వినయకుమార్ వరుసుగా రెండో రోజు అత్యంత ప్రతిభ కనబరిచి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును సొంతం చేసుకున్నారు. అనంతరం జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ సతీష్ యాదవ్ వినయ్ కుమార్ కు మ్యాన్ ఆఫ్ మ్యాచ్ అవార్డును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రక్రికెట్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ విజయ్‌కుమార్, యోగేష్, చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు శ్రీధరకుమార్,అన్నమయ్య జిల్లా క్రికెట్ కోచ్ సునీల్కుమార్, సీనియర్ క్రికెట్ క్రీడాకారులు పాల్గొన్నారు.

## తిరుమలరెడ్డిపల్లె మారేమ్మ ఆలయంలో అమ్మ వారికి ప్రత్యేక పూజలు



**రామసముద్రం మే 15 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని తిరుమలరెడ్డి పల్లె గ్రామం లో వెలిసినగ్రామ దేవత మారేమ్మ ఆలయంలో ఆలయ పూజారి శీనప్ప అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం ఆలయశుద్ధి చేసి అమ్మవారికి పలురకాల పుష్పాలు, వేపాకుతోరణాలు కట్టి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు, అధిక సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మారేమ్మ వారిని దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాధాలు అందజేశారు.

## పారిశుద్ధం పై ఎర్రసానిపల్లి కార్యదర్శి పనితీరు భేష్



**తంబళ్లపల్లె మే 15 ప్రభాతవార్త ః**

తంబళ్లపల్లె మండలం ఎర్రసానిపల్లి పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్ ఉదయం 6 గంటలకే గ్రామాలలో పారిశుద్ధం మెరుగుపై దృష్టి సారించడం విశేషం. శుక్రవారం ఎంపీడీవో ఎంవి ప్రసాద్ ఉదయం పంచాయతీలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. అప్పటికే కార్యదర్శి గ్రీన్ అంబాసిడర్ లను వెంటబెట్టుకుని గ్రామాల్లోని వీధుల్లో ప్రజల నుండి తడి పొడి చెత్తను చెత్త ట్రాలీలో వేయించడం ఎంపీడీవో గమనించి ప్రశంసించారు. ఈ సందర్భంగా ప్రజలకు ప్రతిరోజు చెత్తను కచ్చితంగా చెత్త బండిలో వేసి పారిశుద్ధం పాటించాలని సూచించారు. మండలంలోని కార్యదర్శులు ఇదే స్ఫూర్తితో ప్రతి ఒక్కరు చెత్త సేకరణలో ముందుండి ప్రభుత్వ స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యాన్ని నెరవేర్చడానికి సహకరించాలని ఎంపీడీవో సూచించారు.

## కడప పీఠాధిపతిని కలిసిన ఖాజాపీర్ దర్గా పెద్దలు


పీఠాధిపతి ఆరిఫ్ హుస్సేన్‌ను కలిసిన ఖాజా పీర్ దర్గా పెద్దలు

**వాల్మీకిపురం, మే 15, ప్రభాతవార్త :**


స్థానిక హసనాఖాన్ వీధిలోని ఖాజాపీర్ దర్గా ఉరుసు మహోత్సవాల నేపథ్యంలో, దర్గా పెద్దలు శుక్రవారం కడప పెద్దదర్గా పీఠాధిపతి ఆరిఫ్ హుసేనిని కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు. మే 21వతేదీన జరిగే గంధోత్సవ కార్యక్రమానికి పీఠాధిపతిని ఆహ్వానించారు. దీంతో తాము ఉరుసు ఉత్సవాలకు హాజరౌతామని, ఉరుసు ఉత్సవాలను ఘనంగా నిర్వహించడంతో పాటు ఆధ్యాత్మిక వాతావరణం దెబ్బతినకుండా కుల, మతభేదాలకు అతీతంగా ఉత్సవాలు నిర్వహించాలని పీఠాధిపతి సూచించినట్లు దర్గా పెద్దలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దర్గా పెద్దలు సంధాని, గౌస్, తాహీర్, చాను తదితరులు పాల్గొన్నారు.

## ఇంధన ధరల బాదుడు మోడీ

చంద్రబాబు సర్కార్ల దోపిడీ విధానం

ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

పోరాటానికి సిద్ధం: వెంకటేష్



**పీలేరు, మే 15 ప్రభాతవార్త:**

కేంద్రంలో మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం పోటీ పడి పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు పెంచడం ప్రజల పొట్ట కొట్టడమే. ఈ ప్రజా కంఠక నిర్ణయాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ (దిశ) పీలేరు నియోజకవర్గ కమిటీ తీవ్రంగా ఖండిస్తోందని నియోజకవర్గ కార్యదర్శి వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు.

**ప్రజల బతుకు భారమైంది:**

ఒకవైపు కరువు, పంట నష్టం, నిరుద్యోగంతో రైతు, కూలీ అల్లాడుతుంటే, మరోవైపు ఇంధన ధరలతో ప్రభుత్వాలు బాదుతున్నాయి. లీటర్ పెట్రోల్ , డీజిల్ ధరల పెంపు మూడు రూపాయలు పెంచుతూ గ్యాస్ సిలిండర్ ..1200 అయ్యింది. ఆటో, ట్రాక్టర్, లారీ నడిపేవాడు రోజు గడవక అప్పుల పాలవుతున్నాడు. ఇంటి ఖర్చులు రెట్టింపై పేద, మధ్యతరగతి కుటుంబాలు కుదేలవుతు న్నాయి. బస్సు, కూరగాయలు, పాలు, ప్రతి వస్తువు ధర పెరిగి సామా న్యుడు బతకలేని పరిస్థితి తెచ్చారు.

**దోపిడీకి లెక్కేది?**

అంతర్జాతీయ మార్కెట్లో బ్యారెల్ ముడిచమురు ధర 70 ఉన్నప్పుడు ఇక్కడ ..100 పెట్టి అమ్ముతున్నారు. కేంద్రం ఎక్సైజ్ డ్యూటీ, రాష్ట్రం వ్యాట్ పేరుతో లీటర్‌కు ..60 దోచుకుంటున్నారు. ఈ దోపిడీ సొమ్ముతో అదానీ, అంబానీలకు రాయితీలు ఇస్తున్నారు తప్ప ప్రజలకు ఒరిగేదేమీ లేదు. పేదవాడి కడుపు కొట్టి పెద్దల జేబులు నింపడమే ఈ ప్రభుత్వాల విధానం.

**డిమాండ్లు:**

ధరల పెంపును తక్షణమే ఉపసంహరించుకోవాలి. పెంచిన రేట్లు తగ్గించాలి. పెట్రోల్, డీజిల్‌ను జీఎస్టీ పరిధిలోకి తెచ్చి 28 కి మించకుండా పన్ను నిర్ణయించాలి. వంట గ్యాస్ సిలిండర్‌పై ..600 సబ్సిడీ ఇచ్చి, పాత ధర ..500కే అందించాలి.రేషన్ షాపుల ద్వారా కిరోసిన్, గ్యాస్ సరఫరా పెంచాలి.ప్రజా రవాణాను బలోపేతం చేసి ఆర్టీసీ బస్సు చార్జీలు పెంచకుండా చర్యలు తీసుకోవాలి.

## మున్సిపల్ కార్మికులను పర్మనెంట్ చెయ్యాలి

సీఐటీయు నిరసనలు



నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

**మదనపల్లి మే 15 ప్రభాతవార్త**

మున్సిపల్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పిస్తూ పర్మనెంట్ చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ పట్టణ కన్వీనర్ రామకృష్ణ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం ఏపీ మున్సిపాలిటీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్‌ఆ ధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ కార్మకులకు తీవ్ర అన్యాయం చేస్తున్న ఔట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన గైడ్ లెన్స్ ప్రకారం 10 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ సంవత్సరాలు పని చేసిన వర్కర్స్ ను పెర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల పట్ల నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తే ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ప్రమీల ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపి మున్సిపల్ వర్కర్స్ కృష్ణప్ప, శంకర్ నాయక్, నరసింహులు, చిన్నరెడ్డప్ప, రామచంద్ర, శ్రీరాములు, గోపాల్, అమర, జిలాని, శివ, రమేష్, గుర్రాల వెంకటరమణ, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల యాజమాన్యం ప్రమేయం లేకుండా ఆన్లైన్లో పేర్లు తొలగించరాదు


కోర్టు తీర్పున ఎంఈఓకు అందజేస్తున్న దృశ్యం

**పీలేరు మే 15 ప్రభాతవార్త:**

గత సంవత్సరాలలో ప్రైవేట్ స్కూల్లో విద్యను అభ్యసిస్తూ, ఈ సంవత్సరం ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు అయ్యే విద్యార్థులను, ఆన్లైన్లో ప్రైవేట్ మేనేజ్మెంట్ల ప్రమేయం లేకుండానే తొలగించడం వంటి కార్యక్రమాలను విద్యాశాఖ పునరాలోచించాలని, కలికిరి మండలంలోని ప్రైవేట్ యాజమాన్యాలు విజ్ఞాపన పత్రాన్ని కోర్టు తీర్పును ఎంఈఓ కు అందజేశారు. కోర్టు తీర్పు ప్రకారం ఫీజు బకాయిలు ఉన్నచో 50 వెంటనే చెల్లించి రసీదు పొందాలని మిగతా ఆరు సమాన వాయిదాలలో చెల్లించేటట్లు చూడాలని తెలిపారు. పాఠశాల యాజమాన్య ప్రమేయం లేకుండా ఆన్లైన్లో పేర్లు తొలగించరాదని ఎంఈఓ లను కోరడం జరిగింది. మా విజ్ఞప్తికి విద్యా శాఖ అధికారులు సానుకూలంగా స్పందించి, నిబంధనల ప్రకారం నడుచుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదినారాయణ రెడ్డి, రామాంజుల నాయుడు, సుదానంద రెడ్డి, బాబు, భాస్కర్ పాల్గొన్నారు.

## మెడికల్ షాపుల అక్రమాలపై ఫిర్యాదు


ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

**మదనపల్లె, మే 15 ప్రభాతవార్త :**

పట్టణంతో పాటు అన్నమయ్య జిల్లాలోని పలు మెడికల్ షాపుల్లో జరుగుతున్న అక్రమాలు ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారాయని బహుజన యువసేన రాష్ట్ర అధ్యక్షులు పునీత్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేవారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా డ్రగ్ కంట్రోల్ అధికారికి వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. మెడికల్ షాపులు అర్హత కలిగిన పార్మసిస్ట్‌లు లేకుండా నడుస్తున్నాయని ఒకరిపేరుతో లైసెన్స్ తీసుకొని మరొకరు మందులు విక్రయిస్తున్నారని ఆరోపించారు. డాక్టర్ ప్రిస్కిప్షన్ లేకుండానే షెడ్యూల్ హెచ్, హెచ్-1, మందులు యాంటి బయాటిక్స్ వంటి మెడిసన్స్ విచ్చల విడిగా విక్రయిస్తున్నారని ఇది ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడటమేనని తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు కేవలం 12 తనికీలు మాత్రమే నిర్వహించడం శాఖ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. కనీసం నెలకు రెండు సార్లు తనిఖీలు నిర్వహించాలని డిమాండ్‌చేశారు. పార్మసిస్ట్‌లు లేని షాపుల లైసెన్స్‌లను రద్దు చేసి, నకిలీ మందుల మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సంబంధిత ఉన్నతాధికారులు, కలెక్టర్ దీనిపై చర్యలు తీసుకొని ప్రజల ప్రాణాలను కాపాడే విధంగా చర్యలు తీసుకోవాలని బహుజన యువసేన నాయకులు విన్నవించారు. లేనిచో బివైఎస్ ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

## మహిళల భద్రత మత్తుపదార్థాల నిర్మూలనే ధ్యేయం : చిన్నరెడ్డెప్ప



**చౌడేపల్లి, మే 15 ప్రభాతవార్త**

మహిళల భద్రత మత్తు పదార్థాల నిర్మూలనే ధ్యేయంగా పనిచేస్తున్నామని ఎస్ఐ చిన్నరెడ్డెప్ప అన్నారు. మంగళవారం స్థానిక బస్టాండులో ఆయన మహిళలతో పలు కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. యువతీ యువకులు మత్తకు బానిసలై అందమైన జీవితాలను కోల్పోతున్నారన్నారు. తల్లిదండ్రులు అలాంటి వారిని గుర్తించి తెలియజేస్తే వారిని సక్రమమైన మార్గంలో పెడతామన్నారు. ప్రస్తుతం మత్తు పదార్థాలు గుర్తించే పరికరం అందుబాటులో వుందన్నారు. మహిళలు సెల్‌ఫోన్‌లలో శక్తియాప్‌ను కల్గి వుండాలన్నారు. దీనివల్ల మహిళలకు సంపూర్ణ భద్రత వుంటుందన్నారు. సమాజంలో మహిళల మనుగడ, మత్తు పదార్థాల వల్ల కల్గే అనర్థాలను వివరించారు. ఈ మేరకు ఆటో ద్వారా ప్రచారం చేయించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతిష్టాత్మకంగా స్మార్ట్ కిచెన్ నిర్మాణాలు



**సిద్దవటం మే 15 ప్రభాతవార్త**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా స్మార్ట్ కిచెన్ లను నిర్మిస్తోందని రాజంపేట సబ్ కలెక్టర్ భావన తెలిపారు. మండలకేంద్రమైన సిద్దవటం ఎగువపేట జెడ్పీ ఉన్నత పాఠశాల పక్కన నిర్మిస్తున్న స్మార్ట్ కిచెన్ ను శుక్రవారం సబ్ కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కడప జిల్లాలో స్మార్ట్ కిచెన్లను పైలెట్ ప్రాజెక్ట్గా తీసుకుని రాష్ట్రవ్యాప్తంగా నిర్మిస్తున్నారన్నారు. సిద్దవటం, ఒంటిమిట్ట మండలాల్లో నిర్మాణాలు పూర్తయితే మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు ఇక్కడి నుంచే మధ్యాహ్న భోజనం సరఫరా జరుగుతుందన్నారు. త్వరితగతిన స్మార్ట్ కిచెన్ నిర్మాణాలు పూర్తి చేయాలని సంబంధిత గుత్తేదారుతో మాట్లాడాలని ఆమె అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మాధవి లత, ఎంపీడీఓ ఫణి రాజకుమారి, డిప్యూటీ ఎంపీడీఓ మెహెతాజ్ యాస్మిన్, పంచాయతీరాజ్ ఏఈ నాగరాజు, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ గురు ప్రసాద్, ఎంఈఓ 2 అరుణ జెడ్పీ హెచ్ఎం సునీత, డిఎల్డీఓ తదితరులు పాల్గొన్నారు.

## సౌమ్యనాథ స్వామి హుండీ లెక్కింపు

**నందలూరు, మే 15 ప్రభాతవార్త :**
శ్రీ సౌమ్యనాథ స్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.3,01,790 వచ్చినట్లు ఆలయ ఇన్స్పెక్టర్ దిలీప్ కుమార్ తెలిపారు. శుక్రవారం నిర్వహించిన హుండీ లెక్కింపులో ఈ మొత్తం నమోదైనట్లు పేర్కొన్నారు. 30 రోజుల కాలానికి సంబంధించిన హుండీ ఆదాయాన్ని లెక్కించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ హనుమంతయ్య, విజిలెన్స్ అధికారి జనార్దన్తో పాటు భక్తులు పాల్గొన్నారు.



## జిల్లాలో ఓటరు జాబితా
# ప్రత్యేక సవరణ కార్యక్రమాలు

**కడప, మే 15 ప్రభాతవార్త :**
జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని ఎన్నికల కమిషన్ నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జూన్ 5 నుంచి 14 వరకు సిబ్బందికి శిక్షణ, ముద్రణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జూన్ 15 నుంచి జూలై 14 వరకు బీఎల్ఓలు ఇంటింటి సర్వే చేపడతారని తెలిపారు. జూలై 21న ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేయనున్నట్లు చెప్పారు.అలాగే జూలై 21 నుంచి ఆగస్టు 20 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ జరుగుతుందని, సెప్టెంబర్ 18 వరకు వాటి పరిష్కారం పూర్తి చేస్తామని వెల్లడించారు. తుది ఓటరు జాబితాను సెప్టెంబర్ 22న ప్రచురిస్తామని తెలిపారు.అర్హత తేదీల ప్రకారం 01.07.2026 నాటికి 18 సంవత్సరాలు పూర్తిచేసుకున్న యువత ఓటరు నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో సూచించారు.

## పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్య భద్రత



**బద్వేలు అర్బన్, మే 15, ప్రభాతవార్త**
పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా అనేక అంటువ్యాధులను నివారించవచ్చని వైద్య అధికారులు తెలిపారు. శుక్రవారం బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని తొట్టిగారిపల్లిలో శుక్రవారం నిర్వహించిన "ఫ్రైడే డ్రైడే" కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఇంటింటా లార్వా, ఫీవర్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పి. శశివర్ధన్ రెడ్డి, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య మాట్లాడుతూ దోమల ద్వారా డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా, బోదకాలు వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. లార్వా నివారణ చర్యలు, నీటి నిల్వల నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించారు. అవసరమైన ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహిస్తూ ప్రజల ఆరోగ్య రక్షణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పైపు లీకేజీలు, కుళాయిల సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. అలాగే జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తొట్టిగారిపల్లిలో ప్రత్యేక ఐఈసీ కార్నర్ ఏర్పాటు చేసి దోమల ద్వారా వ్యాపించే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి పరీక్షలో పులివెందుల విద్యార్థుల సత్తా

### ఏపీ పీజీఈసెట్లో రాష్ట్ర తొలి రెండు ర్యాంకులు కైవసం

**పులివెందుల, మే 15, ప్రభాతవార్త :**
పులివెందుల ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి కళాశాలకు గర్వకారణంగా నిలిచారు. 2026 సంవత్సరానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ నిర్వహించిన ఏపీ పీజీఈసెట్ పరీక్ష ఫలితాల్లో ఫుడ్ టెక్నాలజీ విభాగంలో పులివెందుల కళాశాల విద్యార్థులు రాష్ట్రంలో తొలి రెండు ర్యాంకులను సాధించినట్లు కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం. మాధవ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలకు చెందిన విద్యార్థిని సుప్రియ రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించగా, మరో విద్యార్థిని కావ్యప్రియ ద్వితీయ ర్యాంకు సాధించిందన్నారు. ఈ ఫలితాలు పులివెందుల ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలకు మాత్రమే కాకుండా ఆచార్య ఎన్జీ రంగా అగ్రికల్చర్ యూనివర్సిటీ కు కూడా గర్వకారణమని పేర్కొన్నారు. అదేవిధంగా విద్యార్థులు కావ్యప్రియ, రాజ్కుమార్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ (సీయూఈటీ)లో కూడా అర్హత సాధించి కేంద్ర విశ్వవిద్యాలయాల్లో పీజీ విద్యను అభ్యసించేందుకు అవకాశం పొందారని తెలిపారు. రాబోయే ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ పీజీ పరీక్షల్లో కూడా మరింత మంది విద్యార్థులు ప్రతిభ కనబరుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. గత సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా గేట్ వంటి పోటీ పరీక్షల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారని, ఇందుకు అంకితభావంతో పనిచేస్తున్న అధ్యాపకులు, నాణ్యమైన బోధన, అత్యాధునిక ప్రయోగశాలలు ప్రధాన కారణమని డాక్టర్ మాధవ వివరించారు. గత సంవత్సరం నుంచి కళాశాలలో ఎం.టెక్ (ఫుడ్ టెక్నాలజీ)లో "ఫుడ్ ప్రాసెస్ ఇంజినీరింగ్" కోర్సును ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కోర్సులో చేరాలనుకునే విద్యార్థులు తప్పనిసరిగా ఐకార్ పీజీ పరీక్ష రాసి, ఆచార్య ఎన్జీ రంగా యూనివర్సిటీ నిర్వహించే కౌన్సిలింగ్లో పాల్గొనాలని సూచించారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటిన విద్యార్థినులు సుప్రియ, కావ్యప్రియతో పాటు వారికి మార్గనిర్దేశం చేసిన అధ్యాపకులను కళాశాల యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించింది.



సుప్రియ | కావ్యప్రియ

## మానవత్వం చాటుకొన్న కువైట్ సభ్యులు..



**సుండుపల్లి, మే 15, ప్రభాతవార్త :**
మండల పరిధిలోని తిమ్మసముద్రం కొత్తపల్లి గ్రామానికి చెందిన ఒక నిరుపేద కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉండగా,రజక సేవాసమితి ఎన్నారై కువైట్ సభ్యులు మానవత్వంతో ముందుకొచ్చి ఆర్థిక సహాయం అందించారు. గ్రామానికి చెందిన చంద్రకళ – మోహన్ దంపతుల 11 సంవత్సరాల కుమారుడు ప్రదీప్ అరుదైన ఎముకల వ్యాధితో బాధపడుతున్నాడు. బాలుడికి అత్యవసర చికిత్స అవసరమని,ఇందుకు సుమారు రూ.30 లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు కుటుంబ సభ్యులకు తెలిపారు. ఇప్పటికే ఆర్థికంగా వెనుకబడిన ఆ కుటుంబం చికిత్స ఖర్చులు భరించలేని పరిస్థితిలో ఉండటంతో, ఈ విషయాన్ని రజక సేవాసమితి ఎన్నారై కువైట్ సభ్యుల దృష్టికి తీసుకెళ్లారు.ఈ విషయంపై స్పందించిన రజక సేవాసమితి కమిటీ సభ్యులు, రజక బంధుమిత్రులు కలిసి మానవతా దృక్పథంతో విరాళాలు సేకరించి ఆ కుటుంబానికి రూ.63,789 ఆర్థిక సహాయం అందజేశారు.ఈ సహాయం బాధిత కుటుంబానికి కొంత ఊరటనిచ్చింది.ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, కుటుంబ సభ్యులు రజక సేవాసమితి ఎన్నారై కువైట్ సభ్యులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఆపదలో ఉన్నవారికి అండగా నిలిచి మానవత్వాన్ని చాటుతున్న సేవాసమితి సభ్యులను పలువురు అభినందించారు.

## కేఎల్ఎం ఎంబీఏ విద్యార్థుల ప్రతిభ



**కడప మే 15. ప్రభాతవార్త**
నగరంలో కృష్ణాపురం నందుగల కెఎల్ఎం ఇంజనీరింగ్ కళాశాలలలో అనంతపురం జేఎన్టీయూ విశ్వవిద్యాలయం వారు గత ఏప్రిల్ నెలలో నిర్వహించిన ఎంబీఏ నాల్గవ సెమిస్టర్ పరీక్ష ఫలితాలలో ( 98.3 ) ఉత్తీర్ణత సాధించారు. ఇందులో మొదటి స్థానం బి షేక్ అఫ్రీన్ ( 91.5 ), ఎల్. చరితా ( 91.2 ) మరియు బి. నాగవసంత లక్ష్మి. ( 91) మార్కులతో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో కాలేజీ టాపర్స్ గా నిలిచారు. మంచి మార్కులతో ఉత్తీర్ణులైన విద్యార్థులను కళాశాల ఎండీ డాక్టర్. చంద్రా ఓబుల్ రెడ్డి ప్రిన్సిపల్ ఎం.వి రత్నమ్మ మరియు విభాగాధిపతి సీ.వీ రమణ, అధ్యాపకులు వీ నాగమహేశ్వర్, కే వేనుగోపాల్ యాదవ్, డీ. పావని, డీ ఇంద్రాణి అభినందనలు తెలుపుతూ విద్యార్థులు ఉన్నత స్థాయిలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

# ప్రజాదర్బార్లో ప్రజల అర్జీల స్వీకరణ

**ఒంటిమిట్ట మే 15. ప్రభాతవార్త**
గ్రామ ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు ఒంటిమిట్ట మండలం సాలాబాదు గ్రామంలో శుక్రవారం గ్రామ సచివాలయంనందు గ్రామస్తుల ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ చమర్తి. జగన్మోహన్ రాజు ఆహ్వానితులయ్యారు. ముందుగా ఆయనకు గ్రామస్తులు మండల టిడిపి నాయకులు కార్యకర్తలు సాదర ఆహ్వానం పలకడం జరిగింది. అనంతరం సచివాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించగా ఆయన పాల్గొని ప్రజల సమస్యలను పంచాయతీ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో సంక్షేమ పథకాలకు, రాష్ట్ర అభివృద్ధికి ,ప్రజా పురోభివృద్ధికి ప్రాముఖ్యతనిస్తుందని పెద్దపీట వేస్తుందన్నారు. అందు నిమిత్తం పలు సంక్షేమ






పథకాలను ప్రజల ముంగిట కూటమి ప్రభుత్వం ఉంచుతుందన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు అనది కాలంలో ఆ సమస్యలను తీర్చేందుకు ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి తాను ఎప్పుడు కట్టుబడి ఉంటానన్నారు. వ్యక్తిగత, గ్రామ సమస్యల గురించి అర్జీల రూపంలో తెలియజేయగా ఆయన స్పందించి అర్జీలను పరిశీలించి పరిష్కారం చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు చేస్తున్న మంచిని గమనించి ఆకర్షితులై గ్రామంలో ఉన్న 25 కుటుంబాల వైసీపీ కార్యకర్తలు ఇంచార్జ్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలోకి చేరి పసుపు కండువా ధరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తాసిల్దార్, ఎంపీడీవో, మండల స్థాయి ప్రభుత్వ అధికారులు, మండల తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## క్రమ శిక్షణ ఉంటేనే విద్యార్థికి భవిష్యత్తు




**వేంపల్లె మే 15 ప్రభాతవార్త**
క్రమశిక్షణ ఉంటేనే జీవితంలో విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని తాహసిల్దారు మోహన్ కృష్ణ పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంబేద్కర్ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వేసవి శిక్షణ తరగతుల కేంద్రాన్ని శుక్రవారం తాహసిల్దారు మోహన్ కృష్ణ సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి శెలవుల్లో చెడు అలవాట్లుకు లోను కాకుండా ఉండేందుకు ఇంగ్లీష్, గణితం, సైన్స్, జనరల్ నాలెడ్జ్ పై విద్యార్థులు పట్టు సాధించేందుకు ఉచిత శిక్షణ తరగతులు పెట్టడం సంతోషకరమని చెప్పారు. ఉచిత వేసవి శిక్షణ తరగతులను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లో పట్ల కూడ మొగ్గు చూపాలని కోరారు. చదువుపైనే ఎక్కువ శ్రద్ధ పెట్టాలని కోరారు. చెడు అలవాట్లుకు లోను అయితే జీవితం అంధకారం అవుతుందని చెప్పారు. చదువులో, క్రీడాల్లో రాణిస్తున్న వారిని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని కోరారు. శిక్షణ తరగతుల్లో ప్రతిభ చూపుతున్న విద్యార్థులను తాహసిల్దారు అభినందించారు. ఈ కార్యక్రమంలో శిక్షణ నిర్వహకులు బందెల రామాంజనేయులు, ఇల్లూరు పుల్లయ్య, చిప్పిరి ఈశ్వరయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## దిగ్విజయంగా చెస్ట్ ఎక్సరే వైద్య శిబిరం



**యర్రగుంట్ల మే 15, ప్రభాతవార్త:**
యర్రగుంట్ల మార్కెట్ యార్డులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు శుక్రవారం నిర్వహించిన ఉచిత చెస్ట్ ఎక్స్రేను 87 మంది సద్వినియోగం చేసుకున్నట్లు ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి తెలిపారు.అడిషనల్ డీఎంహెచ్వో రవిబాబు పర్యవేక్షణలో జరిగిన ఈ శిబిరంలో చెస్ట్ ఎక్స్రే తీయించుకున్నట్లు ఆయన వివరించారు. స్థానిక రాణి వనం లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు శనివారం కూడా ఈ వైద్య శిబిరం కొనసాగుతుందని పట్టణంలోని 40 సంవత్సరాలు దాటిన వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యర్రగుంట్ల ప్రభుత్వ వైద్యురాలు డాక్టర్ జ్యోత్స్న, సూపర్వైజర్లు,ఏఎన్ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# టౌన్ బ్యాంకులో ఆర్బిఐ నిబంధనల మేరకే రుణాలు

**ప్రొద్దుటూరు అర్బన్, మే 15 ప్రభాతవార్త :**
ది ప్రొద్దుటూరు కోఆపరేటివ్ టౌన్ బ్యాంకులో నిబంధనల మేరకే రుణాలు ఇస్తున్నట్లు డైరెక్టర్లు తెలిపారు. టౌన్ బ్యాంక్ మాజీ ఛైర్మన్ వెల్లాల కుమార్ రెడ్డి శుక్రవారం స్థానిక ది ప్రొద్దుటూరు కో ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ నందు వారు విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ ఇటీవల టిడిపి మాజీ ఇంచార్జ్ జివి ప్రవీణ్ కుమార్ రెడ్డి తాము ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ లేకుండా, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి సిఫార్సుల మేరకు ఎస్ఎస్ మాల్ కు రుణం మంజూరు చేసినట్లు మాట్లాడారని, కానీ ది ప్రొద్దుటూరు కో ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ రాజకీయాలకు అతీతంగా పనిచేసే సంస్థ అని, ఇక్కడ రుణ మంజూరు విషయంలో ఏ ఒక్కరి సిఫారసులు పరిగణలోకి తీసుకోమని, కేవలం ఆర్బీఐ నిబంధనల ప్రకారమే రుణాల మంజూరు ప్రక్రియ జరుగుతుందని వివరించారు. కాగా రుణ మంజూరు కు ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ తో సంబంధం లేదని తెలిపారు. 2016 నుండి ఎస్ఎస్ మాల్ సభ్యులకు దాదాపు 3 కోట్ల 28 లక్షల లోన్ మంజూరు చేయగా వారు ఆ మొత్తం తిరిగి చెల్లించిన తరువాత తిరిగి 2021 లో దాదాపు 27 మంది ఎస్ఎస్ మాల్ సభ్యులకు సుమారు 9 కోట్ల 46 లక్షల రూపాయల రుణం అందించాలని వివరించారు. తమ బ్యాంక్ నుండి రుణాలు పొందేవారంతా దాదాపు 50 కోట్ల ఆస్థి కలిగిన వారే అన్నారు. తమ బ్యాంక్ 103 సంవత్సరాల చరిత్ర కలిగిన సంస్థ అని, ఛార్టర్డ్ అకౌంటెంట్ ద్వారా కన్కరెంట్ ఆడిట్ నిర్వహిస్తామని, అదే విధంగా ప్రతి 6 నెలలకు ఒకసారి డిపార్ట్మెంట్ ల వెరిఫికేషన్, 2 సంవత్సరాలకు ఒకసారి ఆర్.బి.ఐ వెరిఫికేషన్ జరిపే సంస్థ అని, బ్యాంక్ లో జరిపే ప్రతి లావాదేవీ ఆర్.బి.ఐ కి తెలుస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ది ప్రొద్దుటూరు కో ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ వైస్ ఛైర్మన్ అక్రమ్, డైరెక్టర్లు సురేష్, రాంభూపాల్ రెడ్డి, కిషోర్, గోదిన గంగాధర్, సురేంద్ర, రామయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టౌన్ బ్యాంక్ మాజీ ఛైర్మన్ వెల్లాల కుమార్ రెడ్డి

## ఐఎఫ్ప్యానల్ ద్వార ఆధునిక విద్యా బోధన

**సుండుపల్లి, మే 15,ప్రభాతవార్త:**
సుండుపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తమ పిల్లలను చేర్పించి వారి భవిష్యత్ అభివృద్ధికి సహకరించాలని విద్యార్థుల తల్లిదండ్రులకు ఉపాధ్యాయ బృందం సూచించింది.విద్యార్థుల ఎన్రోల్మెంట్ డ్రైవ్లో భాగంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు షాకీరా బేగం ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు సిద్దారెడ్డి గారిపల్లె, పెద్ద మాదిగపల్లె, దిగువ మాదిగపల్లె, తొట్టికాడ మాదిగపల్లె గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ తమ పాఠశాలలో ప్రతీ సంవత్సరం ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎటువంటి ఫీజులు లేకుండా విద్య అందిస్తున్నామని, విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, రెండు జతల యూనిఫామ్లు, బూట్లు, బ్యాగులు, పాఠ్యపుస్తకాలు, నోటు బుక్స్ ఉచితంగా అందజేస్తున్నామని వివరించారు. అలాగే ఐఎఫ్ ప్యానల్ ద్వారా ఆధునిక విద్యాబోధన జరుగుతోందని తెలిపారు.పాఠశాలలో ఉన్న విశాలమైన ఆటస్థలంలో క్రీడలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని, గత విద్యా సంవత్సరంలో తమ పాఠశాల విద్యార్థులు ఢిల్లీ, నాగపూర్లలో జరిగిన జాతీయ స్థాయి క్రీడల్లో రాష్ట్ర జట్ల తరఫున ప్రాతినిధ్యం వహించారని ప్రధానోపాధ్యాయులు షాకీరా బేగం తెలిపారు.అలాగే పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్, లైబ్రరీ, ప్రత్యేక ల్యాబ్ సౌకర్యాలు ఉన్నాయని ఉపాధ్యాయులు వివరించారు. పాఠశాలలోని సౌకర్యాలు, జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొన్న విద్యార్థులు, పదవ తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థుల ఫోటోలతో ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు.



# అకటా పాపాగ్ని నదీ గర్భంలో డంపింగ్ యార్డ్

**దరిద్ర కేంద్రంగా మారిన సంపద కేంద్రం**

**స్వచ్ఛభారత్, స్వచ్ఛ ఆంధ్ర కేవలం మాటల్లోనే.**

**ఆచరణలో మురికి భారత్, మురికాంధ్ర, మురికి వేంపల్లి**

**డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి.**

**వేంపల్లి: మే 15 ప్రభాతవార్త**
ప్రధాని పదేపదే స్వచ్ఛభారత్ అంటుంటారు. ముఖ్యమంత్రి పదేపదే స్వచ్ఛంద్ర అంటుంటారు. కానీ ఆచరణలో మాత్రం మురికి భారత్, మురికి ఆంధ్ర మురికి వేంపల్లిగా తయారయ్యాయని రాజ్యసభ మాజీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా ఛైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం కాంగ్రెస్ నాయకులు వేంపల్లి మేజర్ గ్రామపంచాయతీ ప్రక్కన ఉన్న పాపాగ్ని నది గర్భంలో గ్రామపంచాయతీ సిబ్బంది వేసిన డంపింగ్ యార్డ్ గుట్టలను పరిశీలించారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోనే వేంపల్లి గ్రామపంచాయతీ అతిపెద్ద మేజర్గ్రామ పంచాయతీ అని, దాదాపు 50 వేల మంది జనాభా ఉంటారని అన్నారు.గత మూడు నెలలుగా పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బందికి జీతాలు ఇవ్వని కారణంగా వారు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వహించడం లేదు. పర్యవసానంగా వేంపల్లి గ్రామ పంచాయతీ మురికి కూపంగా తయారైంది, డ్రైనేజీ కాలువలు ప్లాస్టిక్ వస్తువులతో, చెత్తాచెదారంతో నిండిపోయాయి. కొన్నిచోట్ల మురికి కుంటలుగా తయారైనాయి. రోడ్లమీద ఎక్కడ చూసినా మురికి దిబ్బలు దర్శనమిస్తాయి. పందులు, కుక్కలు, ఆవులు,ఈగలు, దోమలతో ప్రజలు సహజీవనం చేస్తున్నారు. డెంగు, మలేరియా, టైఫాయిడ్, అతిసార వ్యాధులు విజృంభిస్తున్నాయి. గ్రామంలో ఉన్న సంపద కేంద్రం ఉపయోగంలో లేదు.సంపద కేంద్రం దరిద్ర కేంద్రంగా దర్శనమిస్తోంది.గత కాంగ్రెస్ పాలనలోనే డంపింగ్ యార్డ్ కోసం పాములూరు గుట్టమీద స్థలాన్ని కేటాయించడం జరిగింది. కానీ పంచాయతీ సిబ్బంది దాన్ని ఉపయోగించుకోవడం లేదు. అప్పుడప్పుడు పని చేసే పారిశుద్ధ్య సిబ్బంది పంచాయతీ చెత్తాచెదారాన్ని, మురికిని ట్రాక్టర్లో తీసుకువచ్చి పాపాగ్ని నదీ గర్భంలో వదులుతున్నారు.దీని కారణంగా పాపాగ్ని నదీ గర్భంలో చెత్తాచెదారం గుట్టలు గుట్టలుగా పేరుకుపోయింది.వర్షం వచ్చి నదిలో నీరు ప్రవహిస్తే మొత్తం నది కలుషితమై నదీ పరివాహక ప్రజలు అంటువ్యాధులతో అనారోగ్యానికి గురవుతారు. కాబట్టి వెంటనే పారిశుద్ధ్య సిబ్బందికి పెండింగ్ బకాయిలు చెల్లించాలని, డంపింగ్ యార్డ్ గా పాములూరు గుట్టమీద కేటాయించిన స్థలాన్ని ఉపయోగించుకోవాలని,నదీ గర్భంలో డంపింగ్ యార్డ్ వద్దని, సంపద కేంద్రాన్ని వెంటనే అమలులోకి తేవాలని కాంగ్రెస్ నాయకులు పంచాయతీ అధికారులకు, రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో డి డి వో వెంకటసుబ్బయ్యను, ఈవో నాగభూషణ్ రెడ్డిని కలిసి వేంపల్లి గ్రామపంచాయతీ సమస్యలను వారి దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సుబ్రహ్మణ్యం,పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గపు సమన్వయకర్త ధ్రువ కుమార్ రెడ్డి, వేంపల్లి మండల శాఖ అధ్యక్షుడు రామకృష్ణ, చక్రాయపేట మండల శాఖ అధ్యక్షుడు రామాంజనేయరెడ్డి, వేముల మండల శాఖ అధ్యక్షుడు చాగలేటి వెంకటేశు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఉత్తన్న, తోపి రెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, బద్రీనాథ్, వేమయ్య పాల్గొన్నారు.

